క్లుప్తంగా

వీల్స్‌తో తారు రోడ్లపై తిరిగితే చర్యలు



కారెంపూడి: దమ్ము ట్రాక్టర్లను వీల్స్‌తో రోడ్లపై తిప్పవద్దని కారెంపూడి ఎస్‌ఐ వాసు శుక్రవారం హెచ్చరించారు. పలు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకుని వాటి యజమానులకు ఫైన్ విధించారు. వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై తిప్పడం వల్ల త్వరగా పాడైపోతుందని తెలిపారు. గుంతలు పడిన రోడ్లపై ప్రయాణం సాగించడం ఎంత కష్టమో ఆలోచన చేయాలని ఎస్‌ఐ కోరారు. వీల్స్‌తో తారు రోడ్డు ఎక్కితే కేసులు నమోదు చేయడంతో పాటు ఫైన్ కూడా వేస్తామని హెచ్చరించారు. చేలోకి వెళ్లాకే వీల్స్ వేసుకోవాలని ఆయన సూచించారు.

కారెంపూడిలో స్త్రీ శక్తి విజయోత్సవ సభ



కారెంపూడి: స్త్రీ శక్తి విజయోత్సవ సభను శుక్రవారం కారెంపూడిలో నిర్వహించారు. మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర విద్యుత్తు శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే జూలకంటికి మహిళలు ఘన స్వాగతం పలికారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ కౌన్సిల్ హాలులో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మదార్ సాహెబ్, కమిషనర్ డి.వేణుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కౌన్సిల్ సభ్యులంతా తప్పక హాజరుకావాలని వారు కోరారు.

నేడు విజయవాడలో సంచార జాతుల బహిరంగ సభ



రెంటచింతల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో శనివారం విజయవాడలో నిర్వహిస్తున్న సంచార జాతుల బహిరంగ సభను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బత్తుల రాంబాబు కోరారు. రెంటచింతలలో బీజేపీ మండల అధ్యక్షుడు బోయ నాగిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంచార జాతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా బీజేపీ కృషి చేస్తుందని తెలిపారు. విజయవాడలోని నోవా హోటల్ పక్కన శనివారం ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేస్తున్న ఈ సభకు పల్నాడు నుంచి పెద్దఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని పిలుపు నిచ్చారు. అనంతరం విజయవాడ సభ పోస్టర్లను ఆయన బీజేపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు పోకూరి కాశీపతి, మండల ఉపాధ్యక్షులు ఎ. గోవర్ధన చారి, ఎం. సురేష్‌బాబు, పోలిశెట్టి ప్రభావతి, పార్టీ సీనియర్ నాయకులు పెనుకొండ కుమార్ పాల్గొన్నారు.

జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పేర్ల మార్పు, చేర్పులు చేపట్టిన నేపథ్యంలో పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని గుర్రం జాషువా జిల్లా సాధన సమితి కన్వీనర్ కొరివి వినయకుమార్ పేర్కొన్నారు. జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 31న ఐఎంఏ హాలులో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం సమావేశం నిర్వహించారు. వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించిన నవయుగ కవి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గుర్రం జాషువా పేరును పల్నాడు జిల్లాకు పెట్టడం సముచితమనీ, ఆయనకు గౌరవం దక్కుతుందని అన్నారు. కుల మత రాజకీయాలకు అతీతంగా అందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గుర్రం జాషువా మనవడు బీఆర్ సుశీల్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, గోదా రమేష్‌కుమార్, గోదా జాన్‌పాల్, బూదాల బాబూరావు, కాకాని సుధాకర్, బత్తుల మురళి, విజయ్ కుమార్, సుకుమార్ పాల్గొన్నారు.

తేట తెలుగు.. తేనెలొలుకు !

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- వ్యవహారిక భాషా పితామహుడు గిడుగుకు నివాళి

మంచికల్లు(రెంటచింతల): తెలుగు భాష కన్న తల్లి వంటిదని, కమ్మనైన తెలుగు భాషను ప్రతి ఒక్కరూ ప్రేమించాలని మంచికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సిలార్ అహమ్మద్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సిలార్ మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. వరుసగా మూడు ఒలింపిక్స్‌లలో హాకీ క్రీడలో బంగారు పతకాలను దేశానికి తీసుకువచ్చిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కుతుందని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పద్యాలు, వక్తృత్వ విభాగాలలో పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందించారు. ముందుగా పాఠశాల ఆవరణలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగు ఉపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీర వసంత, కుమారి, సాయి భాస్కర్, అహమ్మద్ జాని, నాగరాజు, మాధవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణ కోసం పాటుపడాలి

దాచేపల్లి : తెలుగు భాష పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రిన్సిపాల్ నార్ల రవికుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు.



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం సిలార్ అహమ్మద్, టీచర్లు

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ అమ్మలాంటి తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. అనంతరం విద్యార్థులకు తెలుగు భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భాషను కాపాడుకోవాలి

మాచర్ల: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం డాక్టర్ కమలాకర్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్ కమలాకర్ తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

తెలుగు భాష ఉన్నతికి గిడుగు కృషి

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో గల గీతిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష ఉన్నతకి కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ తాళ్లపల్లి బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ పాల మీగడ కన్నా, చెరుకు రసం కన్నా మధురమైనది మన తెలుగు భాష అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలని తెలిపారు. మాతృభాషపై పట్టుతో ఇతర భాషలపైనా పట్టు సాధించవచ్చని చెప్పారు. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులు ధరించడంతో పాటు తెలుగుదనం ఉట్టిపడేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నన్నయ, తిక్కన, ఎర్రన్న, పోతన వంటి తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మశ్రీ , డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషలోనే బోధన జరగాలి

మాచర్ల రూరల్: విద్యార్థులకు మాతృభాషలోనే బోధన జరగాలని తెలుగు భాషా పండితుడు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఎం.కమలహాసన్ అన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రాథమిక విద్య నుంచి తెలుగులో బోధన జరపడం వల్ల భాషా సౌందర్యం, శతక పద్యాలు, కావ్య పఠనం అర్థమవుతుందని తెలిపారు. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా పిలవబడే తెలుగు బాషా కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని సూచించారు. మాతృభాషలోనే విద్యా బోధన జరిపేలా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు.



దాచేపల్లి ఆదర్శ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్



గీతిక పాఠశాలలో తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు



మాట్లాడుతున్న డాక్టర్ కమలాకర్

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

కన్నతల్లి లాంటి తెలుగు భాషను కాపాడుకోవడంలో మనమందరం ముందుండాలని హెచ్‌ఎం ఐ.వి. నాగమణి కోరారు. మండలంలోని కొప్పునూరులో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆమె మాట్లాడారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు అని కొనియాడారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పండితులు పెద యాసఫ్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నారాయణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

వ్యవహారిక భాషా పితామహునికి ఘన నివాళులు



కారెంపూడి: తెలుగు భాషాదినోత్సం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషకు గిడుగు చేసిన సేవలు చిరస్మరణీయమని పాఠశాల ఉపాధ్యాయుడు, బాల సాహితీవేత్త బి. మాన్‌సింగ్ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు టీచర్లను సన్మానించారు.

- ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.

నమో ఏక దంతాయ.. నమో వక్ర తుండాయ !

- వాడవాడలా చవితి ఉత్సవాలు
- రెండు రోజు స్వామికి ప్రత్యేక పూజలు
- పలుచోట్ల సందడిగా నిమజ్జనాలు

మాచర్ల: పట్టణంలోని పలు వార్డుల్లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు శుక్రవారం విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానాలు జరిపారు.

- 13వ వార్డులో 3వేల మందికి నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శ్రీశైలం రింగ్ రోడ్డులోని ప్రశాంతి వద్ద మాజీ వైస్ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు, నిర్వాహకులు కృష్ణారెడ్డిలతో పాటు, సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.
- 16వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆర్యవైశ్యులు భారీగా ఉత్సవాలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.
- పాతూరులోని బురుజు సెంటర్‌లో వినాయకుని విగ్రహానికి విద్యాదేవిగా అలంకరణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.
- 14వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెంటచింతలలో..

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిమజ్జనాలను సందడిగా నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా మోతల మధ్య ఊరేగిస్తూ సత్రశాల వద్ద కృష్ణానదిలో, కంభంపాడు పెద్దకాలువలో నిమజ్జనం చేశారు. స్థానిక బస్‌స్టాండ్ సెంటర్లో శ్రీ లక్ష్మీ గణపతి ట్రాలీ ఆటో,లారీ కారు యూనియన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద 12 కేజీల లడ్డూను మూలి రాజారెడ్డి రూ. 42 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు.

- స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి స్వామివారి 23 కేజీల లడ్డూను కొత్త సందీప్ నాని రూ. 60 వేలకు దక్కించుకున్నారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ కట్టమూరి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గురజాలలో..

పట్టణంలో గణేష్ నిమజ్జన వేడుకలు కోలాహలం నెలకొంది. ప్రతిమలను శుక్రవారం ఊరేగింపుగా తీసుకెళ్లి పొందుగుల , నాగార్జున సాగర్‌లో నిమజ్జనం చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమైన విగ్రహాల నిమజ్జనం రాత్రి 8 గంటల వరకు కొనసాగింది.

- గాంధీ బొమ్మ సెంటర్ మునుసుబు గారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిమజ్జనాన్ని సందడిగా జరిపారు.
- కందిమళ్ల వారి వీధిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదానాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుబ్బారెడ్డి, యెనుముల సైదారెడ్డి, తాయా నాయుడు, షేక్ నాసర్ సైదా, పాదర్తి రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు వై. వినోద్‌కుమార్, బి. అనంత కృష్ణలు బందోబస్తు నిర్వహించారు.

పిడుగురాళ్లలో..

పట్టణంలోని 9వ వార్డులో గజేంద్ర మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద శుక్రవారం 15 కేజీల లడ్డూకు వేలం పాట నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు మాదాల కిరణ్‌కుమార్ రూ. 27 వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో నీరుమళ్ల శ్రీను, మారం రవి, ఊటుకూరి మణిదీప్, రాజేష్ పాల్గొన్నారు.

రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలోని గణపతి కాంప్లెక్స్ వద్ద కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మూడు రోజుల పూజలందుకొని శుక్రవారం కనకతప్పట్ల మధ్య విగ్రహం నిమజ్జనానికి తరలివెళ్లింది. మధ్యాహ్నం మహా అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వేలం పాటలో పిల్లుట్ల గ్రామానికి చెందిన దొండేటి వెంకటరెడ్డి రూ. 60 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు.



రెంటచింతలలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు



రెంటచింతల బస్‌స్టాండ్ సెంటర్‌లోని వినాయకుని లడ్డూను దక్కించుకున్న రాజారెడ్డి



కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి



పిడుగురాళ్లలో లడ్డూను పాడుకున్న కిరణ్‌కుమార్



కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ విగ్రహం వద్ద తీన్మార్ డప్పులు వాయిస్తున్న కళాకారులు



16వ వార్డులో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద పూజలు



లడ్డూ వేలంపాట వేస్తున్న విగ్రహ కమిటీ సభ్యులు



బురుజు సెంటర్‌లో విద్యాదేవి అలంకరణలో స్వామి



14వ వార్డులో ప్రత్యేక పూజల్లో భక్తులు



మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ

నిమజ్జనానికి పోలీసుల ఆటంకాలు

పిడుగురాళ్ల: అడుగడుగునా వైఎస్సార్ సీపీకి చెందిన వినాయక విగ్రహాల ఊరేగింపును శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోని పల్నాడు హాస్పిటల్ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నిమజ్జనం కోసం డీజే ఏర్పాటు చేసుకొని భక్తులతో వెళుతుండగా దాన్ని స్టేషన్‌కు తరలించారు. అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో అప్‌లై చేశామని, అనుమతుల పత్రం కూడా ఉందని తెలిపినప్పటికీ పోలీసులు లెక్క చేయలేదు. అక్కడి నుంచి డీజేను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో భక్తులు నిరాశ చెందారు. డీజే లేకుండానే వినాయకుడి విగ్రహం నిమజ్జనానికి జూలకల్లు కాలువ వద్దకు తీసుకొని వెళ్లారు. దీనిపై డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటు, ఊరేగింపు, డీజే కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని చలానా చెల్లించినట్లు తెలిపారు. అన్ని అనుమతులు తీసుకున్నా దేవుడి కార్యక్రమాన్ని పోలీసులే అడ్డుకొని ఆటంకం కల్పించడం సరైన పద్ధతి కాదని తెలిపారు.



పోలీసులు అడ్డుకోవటంతో భారీగా గుమిగూడిన ప్రజలు

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

పిడుగురాళ్ల రూరల్: ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుభాష్ , ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గల సమైక్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు శుక్రవారం చెక్కుల పంపిణీ చేశారు. 16 డ్వాక్రా సంఘాలకు రు. 3కోట్లు, ఉమెన్ లీడ్ ద్వారా 77 మందికి రూ. 77 లక్షలు, ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా ఆరుగురికి రూ. 6 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం ఈ ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరమణ, వెలుగు సీసీలు, జూలకల్లు ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న రీజినల్ మేనేజర్ సుభాష్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి

ఘనంగా పీవీఆర్ జన్మదిన వేడుకలు



పాలువాయిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ఆరిఫ్, నేతలు

పాలువాయి(రెంటచింతల): వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పాలువాయిలో వైఎస్సార్ సీపీ గ్రామ యూత్ నేతృత్వంలో శుక్రవారం కట్ చేశారు. పార్టీ నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాలువాయి మాజీ సర్పంచ్‌లు పాశం నర్సిరెడ్డి, షేక్ పీర్ సాహెబ్, పార్టీ నాయకులు యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, యరసాని రాఘవరెడ్డి, యర్రెద్దు రామచంద్రారెడ్డి, పాశం మల్లారెడ్డి, శ్యామల శ్రీనివాసరెడ్డి, పాశం మల్లారెడ్డి, షేక్ బిక్కన్ వలి, సీనావత్ హనుమ నాయక్, గాదె నాగిరెడ్డి తదితరులున్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

కారెంపూడి: వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల యువజన విభాగం అధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి (పీవీఆర్) జన్మదినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు కేక్ కట్ చేసి పీవీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కారెంపూడి– 3 ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆరిఫ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ యువత పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరిఫ్ మాట్లాడుతూ జగనన్నకు అండగా వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న పీవీఆర్ నిండు నూరేళ్లు సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

మా ఆశ్రమానికి చెడ్డ పేరు తెస్తున్నారు !

నిర్వాహకురాలు షేక్ జమీల

పిడుగురాళ్ల: తాము నడుపుతున్న సాయి మదర్ థెరిస్సా అనాథ వృద్ధులు, వికలాంగుల ఆశ్రమం పేరిట కొంత మంది వ్యక్తులు ఆటోల్లో ప్రచారం చేసుకుంటూ ప్రజల నుంచి లబ్ధి పొందుతున్నట్లు నిర్వాహకురాలు షేక్ జమీల తెలిపారు. దాని ద్వారా తమ సంస్థకు చెడ్డ పేరు తెస్తున్నారని తెలిపారు. తమతో పాటు కొంత మంది దాతలు సహాయంతో ఆశ్రమాన్ని నడుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆశ్రమం అనుమతి లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు నగదుతో పాటు వస్తువులు సేకరిస్తూ, ఆశ్రమానికి ప్రజల్లో చెడ్డ పేరువచ్చేలా ప్రయత్నిస్తున్నారని ఆమె తెలిపారు. తమ సంస్థకు, వారికి, ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అటువంటి వారిపై త్వరలో తాము పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టనున్నట్లు జమీల వెల్లడించారు. తమ సంస్థ పేరు చెప్పుకుంటూ ఆటోలు తిరుగుతుంటే 9505152603 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆమె పేర్కొన్నారు. దీనిపై త్వరలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు షేక్ జమీల తెలిపారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

నూజెండ్ల: సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దీపికా మంజూషా అన్నారు. మండల కేంద్రంలోని నూజెండ్ల ఎస్టీ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మురుగు నిల్వలు లేకుండా చూడాలని, మురుగు కాల్వల్లో, ఓవర్‌హెడ్ ట్యాంకులు బ్లీచింగ్‌తో క్లీనింగ్ చేసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు.